సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 14 । మే । 2024



అశ్వ వాహనంపై చెన్నకేశవుడు

పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లక్ష్మీ చెన్నకేశవస్వామి అశ్వ వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు.

-8లో



టీడీపీ నాయకుల హల్‌చల్

వైఎస్సార్ జిల్లా బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లెలో టీడీపీ నాయకులు ఏజెంట్లను బయటికి పంపే యత్నంలో వారిపై దాడికి తెగబడ్డారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
39.8/27.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 27.6–39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1. కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

ఓటు వేసిన ప్రముఖులు



పులివెందులలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



కడప: ఓటు హక్కును వినియోగించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు



ప్రొద్దుటూరు: ఓటుహక్కు వినియోగించుకున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి దంపతులు



బద్వేలు అర్బన్ : బద్వేలు పట్టణంలోని ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ఎర్రగుంట్ల: ఓటు హక్కు వినియోగించుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డి



కమలాపురంలో సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్రనాథ్‌రెడ్డి



చాపాడు: నక్కలదిన్నెలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



కడపలో ఓటు వినియోగించుకున్న కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ దంపతులు



కడపలో ఓటు వేస్తున్న కడప వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్‌బీ అంజద్‌బాషా



పోరుమామిళ్లలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



కడప ఎస్వీడీసీ కళాశాలలో బారులు తీరిన ఓటర్లు (ఇన్‌సెట్) పెండ్లిమర్రి మండలం కొండూరులో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధురాలు



ఓటెత్తిన చైతన్యం

సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం దాకా జిల్లాలో ఓట్ల జాతర జరిగింది. ఇటు తూర్పు నుంచి పశ్చిమ కొనవరకు.. అటు ఉత్తరం నుంచి దక్షిణం దాకా.. నలుదిక్కులా జనం 'ఓటు'కు జై కొట్టారు. ఈసారి పల్లెల్లోనే కాదు పట్టణాల్లోనూ ఓటు చైతన్యం వెల్లివిరిసింది. ఇక తొలి సారి ఓటు వేసే యువ ఓటర్లలో ఉత్సాహం ఉరకలేసింది. వేలిపైనున్న సిరా గుర్తును చూపిస్తూ ఉప్పొంగిపోయారు. ఇక మహిళలు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎప్పటిలానే వృద్ధులు అలుపెరగక పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు విలువేంటో చూపించారు. జిల్లా వ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది.

- ఫలించిన అధికార యంత్రాంగం కసరత్తు
- స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటింగ్ నిర్వహణ
- జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు 73.05 శాతం పోలింగ్ నమోదు

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అధికార యంత్రాంగం ముందస్తు కసరత్తు ఫలించింది. అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సైతం సాఫీగా ఓటింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 5 గంటలకు 73.5 శాతం ఓటింగ్ నమోదయ్యింది. పూర్తి ఓటింగ్ శాతం మంగళవారం తెలియనుంది. పోలింగ్‌లో మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచే ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లు బారులు తీరి కనిపించారు. ఈ ఓట్ల పండుగలో సామాన్యులు అత్యధికంగా పోలింగ్‌లో పాల్గొనడంపై అధికార వైఎస్సార్‌సీపీ ధీమా వ్యక్తం చేస్తోంది.

- కడప పార్లమెంటుకు 14మంది, 7అసెంబ్లీ సెగ్మెంట్లుకు 110మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జిల్లాలో 16,39,066 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 800857 మంది, మహిళలు 837993 మంది, థర్డ్ జెండర్ 216 మంది ఓటు హక్కును కల్గి ఉన్నారు. 1963 పోలింగ్ బూత్‌ల ద్వారా పోలింగ్ చేపట్టారు. వీటిలో 1222 (62.25 శాతం) పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ చేపట్టారు. అలాగే 741 (37.75 శాతం) పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ నిర్వహించారు. అందుకు 214 మంది సెక్టార్ అధికారులు, 610 మంది మైక్రో అబ్జర్వర్లు, 2334 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2336 మంది ఏపీఓలు, 9360 మంది ఓపీఓలను నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద షామియానా, ఫర్నీచర్, తాగునీరు, లైటింగ్, బారికేడ్లు, ర్యాంపులతోపాటు ఏఎన్‌ఎం ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్య సదుపాయాలను కల్పించారు.



కడపలో వాకర్ సాయంతో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధుడు

ఓటు హక్కును వినియోగించుకున్న సీఎం దంపతులు

పులివెందుల పట్టణం భాకరాపురం 138వ పోలింగ్ బూత్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఐదేళ్ల పరిపాలనకు పోలింగ్ నిదర్శంగా నిలుస్తోన్నట్లు ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మీడియాతో అన్నారు. ప్రజాతీర్పు ఏకపక్షంగా ఉండనుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

- కడప ఎంపీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి పులివెందులలో, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి షర్మిళ దంపతులు ఇడుపులపాయలో ఓటు వేశారు. జమ్మలమడుగు అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డి నిడుజువ్విలో, ప్రొద్దుటూరు అభ్యర్థి రాచమల్లు శివప్రసాదరెడ్డి రామేశ్వరం బూత్‌లో ఓటేశారు. మైదుకూరు, కడప, కమలాపురం, బద్వేల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వరుసగా శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎస్‌బీ అంజాద్ బాషా, పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, డాక్టర్ సుధా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ పోట్లదుర్తి గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకొని, తిరిగి ప్రత్యేక విమానంలో అనకాపల్లి వెళ్లారు. హైదరాబాద్‌లో కండిషన్ బెయిల్‌పై ఉన్న వైఎస్ భాస్కరరెడ్డి పులివెందులలో ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. టీడీపీ అభ్యర్థులు నంద్యాల వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, రోశన్న, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, పుత్తా చైతన్యరెడ్డి, మాధవీరెడ్డి, భూపేష్‌రెడ్డిలు సైతం వారి వారి స్వగ్రామాల్లో ఓటేశారు.



ఓటు వేశాక సిరా గుర్తు చూపుతున్న యువతి

కడుపు మంట వెళ్లగక్కిన టీడీపీ శ్రేణులు


ఏకపక్ష ఓటింగ్‌కు సాధ్యం కాకపోవడంతో అక్కడక్కడ టీడీపీ శ్రేణులు కడుపు మంటను వ్యక్తం చేశాయి. బద్వేలు పట్టణం చిన్నకేశంపల్లె పోలింగ్ బూత్‌లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఎర్రగుంట్ల పట్టణంలోని 14వవార్డు ఇన్‌ఛార్జి షాహిద్‌పై టీడీపీ నేతల దాడి చేశారు. వేముల మండలం మబ్బుచింతలపల్లె గ్రామంలో టీడీపీకి చెందిన భాస్కర్‌రెడ్డి పోలింగ్ కేంద్రం వద్ద గొడవకు దిగారు. ముందుగానే పథకం ప్రకారం టీడీపీ వర్గీయులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులపై రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన జయరామిరెడ్డి కారుపై రాళ్లు పడడంతో కారు అద్దాలు పగిలాయి. ఆ దారిన వెళుతున్న నందన అనే చిన్నారికి సైతం గాయలయ్యాయి. వీఎన్‌పల్లి మండలం బుసిరెడ్డిపల్లె గ్రామంలో చోటుచేసుకున్న వివాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. బ్రహ్మంగారిమఠం మండలం పలుగురాళ్లపల్లె పంచాయతీ కొత్తపల్లిలో టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ స్వగ్రామంలో వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లపై దౌర్జన్యం చేశారు. కమలాపురం నియోజకవర్గం కోగటం గ్రామంలో పోలింగ్ ఏజెంట్లను కూర్చోబెట్టే విషయంలో ఇరు పార్టీల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రిటర్నింగ్ అధికారి గణేష్‌బాబు జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. చిన్నగులుగలూరు గ్రామంలో ఇరుపక్షాల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకోగా, ఒకరికి గాయాలయ్యాయి.


- రాత్రి 7గంటల సమయంలో బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి కవ్వింపు చర్యలతో జమ్మలమడుగులో ఉద్రిక్తత పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. జమ్మలమడుగు పట్టణంలోని 116, 117 పోలింగ్ బూత్‌లల్లో నిర్ధిష్ట సమయానికంటే ముందే క్యూ లైన్లో నిల్చొని ఓటు కోసం ఉన్నారు. వారందరికీ 350 టోకన్లు జారీ చేసిన పోలింగ్ సిబ్బంది క్రమం ప్రకారం ఓటింగ్ చేయిస్తున్నారు. అక్కడికి చేరుకున్న బీజేపీ అభ్యర్థి 'ఇంకా వైఎస్సార్‌సీపీ నాకొడుకులున్నారంటూ...' లూజ్ టాక్ ప్రయోగించారు. సమీపంలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డి ప్రతిఘటించడంతో ఆది వర్గీయులు ఇటుకతో దాడి చేశారు. సుధీర్‌రెడ్డి వర్గీయులు ప్రతిదాడిలో ఆది వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ క్రమంలో ఉద్రిక్తతలు చోటుచేసుగా, పోలీసులు లాఠీఛార్జీ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. తాత్కాలికంగా వివాదం సద్దుమణిగింది.
- అలాగే రాత్రి 8గంటల సమయంలో కడప నగరంలోని గౌస్‌నగర్‌లో టీడీపీ కార్యకర్తల దుశ్చర్యల మూలంగా రాళ్ల దాడుల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకున్నారు.


శభాష్ పోలీస్...


జిల్లాలో ప్రశాంత పోలింగ్ నిర్వహణకు కలెక్టర్ విజయ్ రామరాజు, ఎస్పీ సిద్దార్థకౌశల్ ముందస్తు ప్రణాళికలు సక్సెస్ అయ్యాయి. ఎన్నికలంటే కడప జిల్లాలో ఉద్రిక్తతలు ఉంటాయని భావించే వారికి ఈ ఎన్నికలు చెక్ పెట్టాయి. ఎస్పీ స్వయంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలు సందర్శించి స్థానికులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ఉపయోగకరంగా నిలిచింది. ఎప్పటికప్పుడు తక్షణమే స్పందిస్తూ పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. పోలింగ్ బూత్‌లల్లో ఎలాంటి అలర్లకు ఆస్కారం లేకుండా వ్యవహరించారని విశ్లేషకులు భావిస్తున్నారు.




















పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీ



ఖాదర్‌పల్లె పోలింగ్ కేంద్రం వద్ద ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

ప్రొద్దుటూరు: ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రొద్దుటూరులో సోమవారం ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పెద్దశెట్టిపల్లె, శంకరాపురం, దొరసానిపల్లె, మున్సిపాలిటీలోని ఒకటో వార్డు, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు.

చాపాడు: చాపాడులో పోలింగ్ నిర్వహణపై ప్రశ్నార్థకంగా మారిన క్రమంలో గట్టి పోలీసుల బందోబస్తు నడుమ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నాగిరెడ్డితో కలసి పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలించారు. పోలింగ్ సరళిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.



కమలాపురం నియోజకవర్గం నందిమండలంలో ఓటర్ల క్యూ



వల్లూరు: సీతోరుపల్లె పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న శతాధిక వృద్ధురాలు మల్లమ్మ





కడపలో పోలింగ్ అనంతరం ఈవీఎంలను సీల్ వేసి భద్రపరుస్తున్న పోలింగ్ సిబ్బంది

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

కమలాపురం: మండల పరిధిలోని పెద్దచెప్పలి పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పరిశీలించారు. సోమవారం సాయంత్రం పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎస్పీ పోలింగ్ సరళిని పరిశీలించారు. శాంతి భద్రతలు, బందోబస్తు గురించి అడిషనల్ ఎస్పీ, సీఐ రామక్రిష్ణారెడ్డిలతో ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు తీసుకెళ్లే వరకు భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు.



పెద్దచెప్పలిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

యర్రగుంట్ల పోలింగ్ కేంద్రం పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిద్ధార్థ్ కౌశల్

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణంలోన జరుగుతున్న ఎన్నికల సరళిని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సోమవారం పరిశీలించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో పోలింగ్ ప్రక్రియను ఆయన చూసి పోలీసులకు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

టీడీపీ నాయకుల హల్‌చల్

- ఏజెంట్లను బయటికి పంపేందుకు యత్నం
- అడ్డుకున్న ఇతర ఏజెంట్లపై దాడి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఓటర్లు పెద్ద ఎత్తున తరలి రావడంతో సోమవారం అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు పలుచోట్ల ఏదో కారణం చూపుతూ ఘర్షణలకు దిగారు. రాళ్లతో దాడులు చేస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని చోట్ల ఏజెంట్లను బయటికి తరిమే యత్నంలో వారిపైనా దాడులు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పలు చోట్ల తీవ్రంగా గాయపడ్డారు. ఓటు వేయాలని వచ్చిన ఓ మహిళ చేయి విరిగింది. ఎలాగైనా గెలవాలంటూ.. టీడీపీ తీవ్ర స్థాయిలో కవ్వింపు చర్యలు దిగింది.

బద్వేలు అర్బన్ : వైఎస్సార్ జిల్లా బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లెలో టీడీపీ నాయకులు హల్‌చల్ చేశారు. ఏజెంట్లను బయటికి పంపే యత్నంలో.. వారిపై దాడికి తెగబడ్డారు. మండలంలోని చిన్నకేశంపల్లె గ్రామంలోని 179వ బూత్‌లో పోలింగ్ జరిగింది. ఉదయం వైఎస్సార్‌సీపీ, బీజేపీ, ఇతర పార్టీల తరఫున 8 మంది ఏజెంట్లు పాల్గొన్నారు. బూత్‌లో మొత్తం 947 ఓట్లు ఉండగా సాయంత్రం 5 గంటలకు 747 పోలయ్యాయి. సాయంత్రం బీజేపీ ఎమ్మెల్యే, టీడీపీ ఎంపీ అభ్యర్థుల ఏజెంట్లు వచ్చి మిగతా పార్టీల ఏజెంట్లు బయటకు వెళ్లాలంటూ హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ, జనసహాయకశక్తి పార్టీల ఏజెంట్లు రవీంద్ర, మల్లికార్జునరెడ్డి ఎందుకు వెళ్లాలంటూ అడ్డు చెప్పారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం తలెత్తింది. అనంతరం తెలుగుదేశంపార్టీ నాయకులు రితీష్‌రెడ్డి ఓటు వేసేందుకు తన అనుచరులతో బూత్ వద్దకు రాగా, ఘర్షణ విషయాన్ని ఆయనకు టీడీపీ నాయకులు తెలిపారు. కోపోద్రిక్తుడైన రితీష్ ఏజెంట్ మల్లికార్జునరెడ్డిని పరుషపదజాలంతో దూషిస్తూ ఊరు విడిపిస్తా అంటూ హెచ్చరించారు. అంతటితో ఊరుకోక 'కొట్టండిరా' అంటూ అరవడంతో ఆయన అనుచరులు మల్లికార్జునరెడ్డిని బయటకు లాగి విచక్షణారహితంగా దాడి చేశారు. అక్కడి పోలీసులు ఆపాలని యత్నించినా బెదరకుండా దాడికి దిగారు. ఈ ఘటనలో మల్లికార్జునరెడ్డి చొక్కా చినిగిపోవడంతో గాయాలయ్యాయి. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు ఆపే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఏ మాత్రం బెదరకుండా దాడికి యత్నించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏజెంట్ రవీంద్రపై కూడా దాడి చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ చేరుకుని టీడీపీ నాయకులను గ్రామం నుండి పంపించి వేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధ బాధితుడితో కలిసి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు ఏజెంట్లపై దాడులకు దిగారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ బూత్ వద్ద వైఎస్సార్‌సీపీ, జనసహాయకశక్తి పార్టీ ఏజెంట్లపై దాడికి పాల్పడుతున్న టీడీపీ నాయకులు

కడప గౌస్ నగర్‌లో టీడీపీ రాళ్లదాడి

- వైఎస్ఆర్‌సీపీ నాయకుడు రమేష్‌రెడ్డికి గాయాలు
- అల్లరి మూకలను చెదరగొట్టిన పోలీసులు...


గాయపడిన రమేష్‌రెడ్డి

కడప అర్బన్ : కడప నగరంలోని దేవుని కడప రోడ్డులోని గౌస్‌నగర్ మున్సిపల్ బాలుర ప్రైమరీ పాఠశాల వద్ద టీడీపీ నాయకులు రాళ్ల దాడికి దిగారు. వల్లూరు మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు గౌస్ నగర్‌లోని పోలింగ్ స్టేషన్ వద్దకు వచ్చి ఇంకా ఈవీఎంలను ప్యాకింగ్ చేసి పంపలేదా?అంటూ గద్దించారు. పోలీసులు, స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు కలికి వారిని దేవుని కడప రోడ్డువైపు పంపించేశారు. దీంతో బూత్ వద్ద తమకు అవమానం జరిగిందని చెప్పి వారి మనుషులను పెద్ద ఎత్తున రప్పించారు. వారంతా కలిసి వైఎస్ఆర్‌సీపీ నాయకులు, స్థానిక యువకులపై రాళ్లను విసిరారు. కడప చిలకలబావి సమీపంలో వున్న ఓ పాఠశాల కరస్పాండెంట్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రమేష్‌రెడ్డి గాయపడ్డారు. డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్ బాబు చేరుకున్నారు. అప్పటికే పోలీసు అధికారులు అల్లరి మూకలను తరిమికొట్టారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామనీ సీఐ ఇబ్రహీం తెలియజేశారు. ఈ సంఘటనలో పోలీసులకు గాయాలైనట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి


గాయపడిన మహమ్మద్ హనీఫ్

ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ నాయకులు దాడి చేసిన ఘటనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహమ్మద్ హనీఫ్ గాయపడ్డారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన మహమ్మద్ హనీఫ్ సోమవారం 128 పోలింగ్ స్టేషన్‌లో ఏజెంట్‌గా కూర్చున్నాడు. పోలింగ్ అనంతరం మైదుకూరు రోడ్డులోని బాలాజీ నగర్‌లో తన కుమారుడిని తీసుకొచ్చేందుకు బైక్‌లో బయలుదేరాడు. కొట్టి స్కూల్ వద్ద జనాలు గుంపుగా ఉండటంతో హనీఫ్ అక్కడికి వెళ్లాడు. అక్కడికి వచ్చిన టీడీపీ నాయకుడు బస్సు మురళీ 'కొట్టరా ఈ నాకొడుకును..' అంటూ రెచ్చ గొట్టగా డ్రైవర్ రామిరెడ్డి వాహనం దిగొచ్చి ప్యాకెట్ నైఫ్‌తో హనీఫ్‌పై దాడి చేసి గాయ పరిచాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హనీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

మైదుకూరు రోడ్డులోని కొట్టి హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు లాఠీ చార్జి చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కొట్టి హైస్కూల్ వద్దకు వెళ్లారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి అక్కడే ఉండడంతో ముందు జాగ్రత్త చర్యగా ఇరువురిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నాయకులు కేకలు వేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడటంతో పోలీసులు లాఠీ చార్జి చేశారు.

కవ్వింపు.. రాళ్లతో దాడులు

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె మండలం యు.వెంకటాపురం, బుసిరెడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. బుసిరెడ్డిపల్లెలో టీతడీపీ కార్యకర్తలు వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త శ్రీనివాసులురెడ్డి చెవిని కొరికారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కడపలో వాగ్వాదం

కడప నగరంలోని పాత రెడ్ క్రాస్ బిల్డింగ్ వెనుక పోలింగ్ బూత్‌లో డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్ బాషా ఉన్నారనే సమాచారంతో టీడీపీ నేతలు శ్రీనివాసులరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి వచ్చి అందరినీ బయటికి పంపాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలెవరూ పోలింగ్ వద్ద ఉండకూడదని చెప్పడంతో నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

చాపాడు మండలంలో ఘర్షణ

వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం చిన్నగులువలూరులో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కుర్ర నరసింహులు అనే టీడీపీ కార్యకర్తకు గాయాలయ్యాయి. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ సీరియస్‌గా తీసుకుని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామిరెడ్డితోపాటు వందమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.


చిలమకూరులో జిల్లా పరిషత్ హైసూకేల్ వద్ద వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు (ఇన్‌సెట్) బాధితుడు షాహీద్

ఎర్రగుంట్లలో దాడి

జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని 14వ వార్డు ఇన్‌ఛార్జి షాహీద్‌పై టీడీపీ నేతలు దాడి చేశారు. జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు వేసి బయటకు రాగా.. ఇక్కడ ఏం చేస్తున్నావంటూ వటీడీపీ నేతలు ప్రశ్నించారు. ఓటు వేసి వస్తున్నానని అతను చెప్పినా.. వారు వినకుండా దాడి చేశారు.

ఇరువర్గాల వాగ్వాదం

జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల మండలం చిలమకూరు పంచాయతీ పెద్దనపాడులో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. జిల్లా పరిషత్ హైస్కూల్ పోలింగ్ బూత్ ఎదురుగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఉండగా, వారిని పంపివేయాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి అనుచరుడు పోలీసులకు చెప్పారు. అదే సమయంలో సమీపంలోనే బీజేపీ శ్రేణులు ఉండటంతో.. వారిని పంపేయాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కోరారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం పెరిగింది. బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డి చేరుకోగా.. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సమస్య సద్దుమణిగింది.

బూత్‌లలోనే ప్రచారం

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభమైనప్పటికీ పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి మధ్యాహ్నం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. మధ్యాహ్నం తర్వాత పలు బూత్‌లలో టీడీపీ నాయకులు హల్‌చల్ చేసి బూత్‌లలోనే ప్రచారానికి దిగారు. టీడీపీ నేతల చర్యలను పోలీసులకు ఫిర్యాదు చేసి అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్, మండల పరిధిలోని గొడుగునూరు తదితర బూత్‌లలో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.

ఏజెంట్ల మధ్య వాగ్వాదం

వైఎస్సార్ జిల్లా చిన్నగురువళూరు పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో కుచ్చుపాప ఉగ్ర నరసింహులు, వినోద్ కుమార్‌లు గాయపడ్డారు. వీరిలో వినోద్ కుమార్‌ను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పడమర అనంతపురం గ్రామంలో ప్రశాంతం జరుగుతున్న పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి సతీమణి పోలింగ్ అధికారులు, ఏజెంట్ల పట్ల దురుసుగా ప్రవర్తించగా పోలీసులు అక్కడి నుంచి పంపేశారు.

టీడీపీ రౌడీల దాడి


నక్కావాండ్లపల్లిలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన తిరుపాల్‌నాయుడు

రాయచోటి : టీడీపీ రౌడీ మూకల చేతిలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. రాయచోటి రూరల్ మండలం నక్కావాండ్లపల్లి పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లకు అనుమతి లేదని గ్రామ సర్పంచ్ ప్రభావతమ్మ, ఆమె సోదరుడు తిరుపాల్‌నాయుడు గ్రామస్థ సూచించారు. ఈ సందర్భంగా మాటా మాటా పెరిగి ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. పోలీసులు సర్ది చెప్పి పంపినప్పటికీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి ఆ గ్రామానికి రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రౌడీమూకలు కలిసి తిరుపాల్‌నాయుడును రక్తగాయాలయ్యేలా కొట్టారు. పోలీసులు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గాయపడిన తిరుపాల్‌నాయుడును ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సంఘటనపై ఎమ్మెల్యే ఆరా తీశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

మళ్లీ సీఎం జగనే...

– వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పి.రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : రాష్ట్ర వ్యాప్తంగా జగన్ ప్రభంజనం వీస్తోందని, మళ్లీ జగనే సీఎం కానున్నారని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. కమలాపురం పట్టణ పరిధిలోని 27వ పోలింగ్ బూత్‌లో సోమవారం ఆయన తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంతకుముందు మండలంలోని దేవరాజుపల్లె, పెద్దచెప్పలి, రామాపురం, చిన్నపుత్త తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసులు మంచి భద్రత కల్పించారన్నారు. అయితే ఉదయం 6 గంటల నుంచే మహిళలు, వృద్ధులు, వితంతువులు భారీ ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేసేందుకు క్యూలైన్లలో వేచియున్నారని, అన్నారు. వారి ఓట్లతో జగనన్న చరిత్ర సృష్టించనున్నారని తెలిపారు. తనపై నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే, అదీ మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే ఓటు వేయాలని జగనన్న కోరడంతో వారంతా ఓటు వేయడానికి వచ్చారన్నారు. జూన్ 4న జరిగే ఫలితాల్లో 175కు 175 సీట్లు రావడం ఖాయమని, జగనన్న రెండోసారి సీఎం కావడం తథ్యం అన్నారు.

ఫ్యాన్ ప్రభంజనం తథ్యం

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించ బోతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు అన్నా రు. స్థానిక శ్రీవాణీ విద్యాలయం వద్ద ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం సోమవారం సాయంత్రం మీడియాతో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో 10 శాతం ఎక్కువ పోలింగ్ నమోదు కాబోతోందన్నారు. గతంలో 60 శాతానికి మించి జరిగేది కాదని, వలంటీర్ వ్యవస్థ, సచివాల య వ్యవస్థ వల్లే పోలింగ్ శాతం పెరిగిందన్నారు. ఉ మ్మడి వైఎస్సార్ జిల్లాలో పదికి పది అసెంబ్లీస్థానాలు, రెండు ఎంపీ స్థానాలు తాము గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంట నిలిచారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవడానికి ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, 12వ డివిజన్ కార్పొరేటర్ సానపురెడ్డి శివకోటిరెడ్డి, బండి ప్రసాద్, మదన్‌మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, ప్రసాద్, మహేష్, సింధే రవి, బండి ఉమ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి కారుకు నిప్పు


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సంఘటనా స్థలం పరిశీలించిన ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డమీది రమణయ్యకు చెందిన బొలెరో వాహనానికి గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి నిప్పు పెట్టారు. మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారి పక్కన ఉన్న పల్లవోలు గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న కారు నిలిపారు. అర్ధరాత్రి కారులో మంటలు చెలరేగగా స్థానికులు గుర్తించి ఆర్పివేశారు. అప్పటికే కారు అద్దాలు పగిలి లోపలి సామాగ్రి కాలిపోయింది. బాధితులు రమణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వెంకటేశులు, రూరల్ సీఐ శ్రీనాథరెడ్డి, ఎస్ఐ ఆర్‌వ. కొండారెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యేలు..

సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరగాల్సి ఉండగా ఆదివారం అర్ధరాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడి కారుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం కలకలం రేగింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నియోజకవర్గ సమన్వకర్త నాగిరెడ్డి పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి ఈ ఘాతుకానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అశ్వ వాహనంపై చెన్నకేశవుడు

వల్లూరు : పుష్పగిరి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం కామాక్షీ వైద్యనాథ స్వామి తిరుచ్చి వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి అభిషేకం, ,శ్రీ చక్ర సహిత కామాక్షీ అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం స్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెన్న కేశవ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో యాగశాల పూజలు, వివిధ హోమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి లక్ష్మీ చెన్నకేశవస్వామి అశ్వ వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, దివిటీల వెలుగులతో కొండపై నుంచి స్వామిని పెన్నా నది మీదుగా పల్లకిలో మోస్తూ గ్రామంలోని వీధులలో ఊరేగించారు.


అశ్వ వాహనంపై చెన్న కేశవ స్వామి


తిరుచ్చి వాహనంపై కామాక్షీ వైద్యనాథేశ్వరులకు గ్రామోత్సవం

నేడు చక్రస్నానం

పుష్పగిరి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం వైద్యనాథస్వామి త్రిశూలం, చెన్నకేశవస్వామి సుదర్శన చక్ర స్నానం జరుగుతుంది. అనంతరం రెండు ఆలయాల్లో పూర్ణాహుతి, ధ్వజావరోహణం చేస్తారు. సాయంత్రం 4.30 గంటల నుండి లక్ష్మీ చెన్నకేశవాలయంలో పుష్పయాగం జరుగుతుంది. రాత్రి 7 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామి ఆలయంలో రావణేశ్వర వాహన సేవ జరుగుతుంది. అనంతరం చెన్న కేశవ స్వామికి తిరుచ్చి వాహన సేవ జరుగుతుంది.

ఆటో ఢీకొని యువకుడు దుర్మరణం


మతి చెందిన హర్షవర్ధన్ రెడ్డి

బి.కొత్తకోట : ఇంటికి వచ్చిన బంధువును బస్టాండులో వదిలేందుకు బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన సోమవారం బి.కొత్తకోట సమీపంలో జరిగింది. ఏఎస్ఐ బొజ్జే నాయక్ కథనం మేరకు.. బి.కొత్తకోట–పీటీఎం రోడ్డు టి.సదుం క్రాస్‌లో వెంకటరమణారెడ్డి నివాసం ఉంటున్నాడు. ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లి గ్రామానికి చెందిన బంధువు మమత (40) వీరి ఇంటికి వచ్చారు. సోమవారం తిరిగి ఆమె స్వగ్రామానికి వెళ్లేందుకు సిద్ధమైంది. వెంకటరమణారెడ్డి ఈమెను బైక్ పై తీసుకెళ్లి బి.కొత్తకోట బస్టాండ్‌లో దింపాలని కొడుకు హర్షవర్ధన్ రెడ్డి (20)కి చెప్పాడు. హర్షవర్ధన్ మమతతో బైక్ పై బి.కొత్తకోట వస్తుండగా, ఆలేటివారిపల్లె క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గాయపడిన మమతను మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. హర్షవర్ధన్ మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఆస్పత్రి తరలించారు. మతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.